క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్య



సత్తుపల్లిలో అంగన్‌వాడీ బడిబాట నిర్వహిస్తున్న సీడీపీఓ రత్నమ్మ, సూపర్‌వైజర్ మహాలక్ష్మి

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుందని ఐసీడీఎస్ సత్తుపల్లి సీడీపీఓ రత్నమ్మ అన్నారు. పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో శనివారం సూపర్‌వైజర్ మహాలక్ష్మితో కలిసి అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వాతి, తామారు, వీరకుమారి, రహ్మతున్నీసా, ఆయాలు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న సాదిక్ అలీ

కల్లూరు: కల్లూరు ఎస్‌ఎస్‌పీ పాఠశాలలో శనివారం తోపుడుబండి నిర్వాహకులు సాదిక్ అలీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర ప్రసాద్, హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నివేదిత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కె.పుష్పావతి, పీఈటీ పి.వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకారుడు గౌరీశంకర్‌కు సత్కారం

సత్తుపల్లిరూరల్: పెన్సిల్ లిడ్‌తో సూక్ష్మకళ చేస్తూ గిన్నీస్‌రికార్డు కోసం శ్రమిస్తున్న గుమ్మడిదల గౌరిశంకర్‌ను సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కళాశాలలో డిప్లమా పూర్వ విద్యార్థి గౌరీశంకర్ సూక్ష్మకళపై చేస్తున్న కృషి ఫలించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, డీన్ జాకీర్ హుస్సేన్, రామచంద్రరావు, రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేరువంచ హైస్కూల్‌కు బీరువాలు వితరణ



బీరువాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.25వేలు విలువైన రెండు బీరువాలను వితరణగా అందజేశారు. ఇటీవల నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో హైస్కూల్ హెచ్‌ఎం సుదర్శన్‌రావు వారి తరుపున బీరువాలు అందించాలని కోరగా రెండు బీరువాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామదాసు, సుజాత, సీతారాంరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు మౌలాలి, షరీఫ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఫ్యాన్లు..



అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు అందజేస్తున్న అన్వేష్

ముదిగొండ: మండలంలోని వల్లబిలో భట్టి జన్మదినం సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిచ్చాల అన్వేష్ గ్రామంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు వితరణగా అందించారు. రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ నాగేశ్వరరావు, ప్రదీప్తబాబు, నాయకులు రమేష్‌బాబు, దేవేంద్రం, వీరబాబు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న ఆంజనేయ భక్తులు

కల్లూరురూరల్: ల్లూరు మండలంలోని పుల్లయ్య బంజరు గ్రామానికి చెందిన 60 మంది ఆంజనేయస్వామి భక్తులు శనివారం అంజనాపురంలో గల ఆంజనేయస్వామి దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని దేవున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు నరసింహారావు, బొబ్బిలి పద్మావతి, కిష్టంశెట్టి సావిత్రి, ఉపేంద్ర, శ్రీను, కిషోర్ పాల్గొన్నారు.

ఏయ్ రిక్షా.. పిలుపు కరువు

- వస్తులతో రిక్షా కార్మికులు
- కనుమరుగవుతున్న గూడు రిక్షాలు
- గూడ్స్‌గా మారుతున్న వైనం

సండే స్పెషల్





మధిరలో తిరుగుతున్న రిక్షా కార్మికులు

మధిర: మండుతున్న ఎండలకు పనులులేక రిక్షా కార్మికుల డొక్కలు ఎండుతున్నాయి. ఒకప్పుడు మధిర పట్టణంలో 150కిపైగా గూడురిక్షాలు ఉండేవి. కానీ నేటి కంప్యూటర్ యుగంలో రిక్షాలు ఎక్కేందుకు ప్రయాణికులు మొగ్గు చూపకపోవడం, ఆయా కార్మికులకు జీవనోపాధి కరువవుతుండటంతో గూడురిక్షాలను తొలగించి బతుకు చిత్రాన్ని మరోవైపు మార్చుకుంటున్నారు. ప్రస్తుతం మధిర పట్టణంలో గూడురిక్షాలు లేకపోవడం గమనార్హం. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఎండలో ఉండి పనులకోసం నిరీక్షించి సాయంత్రానికి వాడిపోయిన ముఖాలతో కార్మికులు ఇంటికి చేరుకుంటున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి కుటుంబం కూడా గడిచే పరిస్థితులు లేవు.

పనులు వెతుక్కుంటున్న కార్మికులు..

ఒకప్పుడు పట్టణంలో ఒక వెలుగువెలిగిన ఈ కార్మికులు నేడు పొట్టచేతపట్టుకుని పనులకోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. 'ఏయ్ రిక్షా..' అనే పదం నేటి పట్టణాల్లో వినిపించడం లేదు. ఒకప్పుడు పట్టణాల్లో, నగరాల్లో ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్లాలన్నా ఈ గూడు రిక్షాలే ప్రధాన రవాణా సాధనాలు. ఏయ్ రిక్షా అనే పిలుపు వినపడగానే పదుల సంఖ్యలోవచ్చి రిక్షా కార్మికులు వారిని చుట్టిముట్టి ఎక్కడికి వెళ్లాలండి అంటూ ఆప్యాయంగా అడిగేవారు. ఆ తరువాత రెక్కలు ముక్కలు చేసుకుని సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేవారు. అప్పట్లో రోజుకు రూ.200లకుపైగా సంపాదించేవారు. దీంతో వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండేది.

కనుమరుగవుతున్న రిక్షావాలాలు..

రానురాను ఆటోల రంగప్రవేశంతో రిక్షాలవైపు కన్నెత్తిచూసేవారు కరువయ్యారు. ఈ వాహనాలసంఖ్య పెరగడంతో రిక్షావాలాల కష్టాలు రెట్టింపయ్యాయి. కాలక్రమంలో రిక్షాలు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. మధిర రైల్వే ఓవర్‌బ్రిడ్జి కింద ఉన్న ఈ గూడురిక్షాల స్టాండ్ ఒకప్పుడు కళకళలాడుతూ ఉండేది. నేడు గూడురిక్షాల సంఖ్య తగ్గిపోవడంతో రిక్షా వర్కర్స్ యూనియన్ సెంటర్ బోసిపోతుంది. మండుతున్న ఎండలనుసైతం లెక్కచేయకుండా జీవనోపాధికోసం రోజుమొత్తం వేచిచూసి పనులు ఉన్నరోజున కొంతవరకు సంతోషంగా, లేనిరోజున నిరాశ నిస్పృహలతో ఇళ్లకు చేరుకుంటున్నారు. కుటుంబ పోషణకోసం రిక్షావాలాలు పడరానిపాట్లు పడుతున్నారు. ఎన్నో దశాబ్దాలుగా రిక్షాలనే నమ్ముకుని జీవిస్తున్న ఇటువంటి కార్మికులకు ప్రభుత్వం రుణాలిచ్చి వారికి ఏదోఒక రకంగా ఉపాధి కల్పించాలని రిక్షా కార్మికులు కోరుతున్నారు.

> గతంలో బంధువులు, స్నేహితులు తమ ఊరికి వస్తున్నారంటే ముందుగానే బస్టాండ్‌కు, రైల్వేస్టేషన్‌కు చేరుకుని వారిని గూడు రిక్షాలు ఎక్కించి ఇంటికి తీసుకువెళ్లేవారు. రిక్షా కార్మికులుసైతం ఆ బంధువులకు పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ, వారివారి ఊరి విశేషాలు చెప్పుకుంటూ గమ్యానికి చేరుకునేవారు. అదేవిధంగా అత్యవసర సమయంలో ఆస్పత్రులకు, ప్రభుత్వ కార్యాలయాలకు సకాలంలో చేరుకోవాలన్నా ఈ రిక్షాలు అందుబాటులో ఉండేవి. అయితే నేటి ఆధునిక సమాజంలో వచ్చిన మార్పుల్లో రిక్షా కార్మికులకు ఆదరణ కరువైంది. ఆటోలు, ద్విచక్రవాహనాల రాకతో రిక్షా కార్మికుల జీవనచిత్రం కదుదయనీయంగా మారింది.

ప్రభుత్వం ఆదుకోవాలి..



ప్రతిరోజు ఆత్కూరు నుంచి రిక్షా తీసుకుని మధిర పట్టణానికి వస్తుంటాను. గత 30 సంవత్సరాలకు పైగా రిక్షా నడుపుతూ జీవిస్తున్నాను. అప్పట్లో ఎక్కడికి వెళ్లాలన్నా ప్రయాణికులు రిక్షా అని పిలిచేవారు. ఇప్పుడు ఆ పిలుపే కరువైంది. దీంతో కూలి గిట్టక గూడు రిక్షా తొలగించి గూడ్స్ రిక్షాగా మార్చుకోవడం జరిగింది. ఎండలకు బేరాలు సరిగా లేవు. రిక్షా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– దాలు కృష్ణ, రిక్షా కార్మికుడు, ఆత్కూరు

ఆదరణ కరువైంది..



చిన్నప్పటినుంచి రిక్షా కార్మికుడిగా జీవిస్తున్నాను. ఆటోలు వచ్చిన తర్వాత గూడు రిక్షాలకు ఆదరణ లేకుండా పోయింది. అప్పట్లో ప్రయాణికులను ఒక చోట నుంచి మరొక చోటుకు తీసుకొని వెళుతుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఆ రోజులు పోయాయి. బేరాలు లేకపోవడంతో గూడ్స్ రిక్షాగా మార్చి గోడౌన్‌లో ఉన్న వస్తువులను దుకాణాలకు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాం.

– చిరపంగి రాజేష్, రిక్షా కార్మికుడు, మధిర ఎస్సీ కాలనీ

నులిపురుగులను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

మధిరరూరల్: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నిర్మూలించాలని ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల టాస్క్ ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పద్వీరాజ్ మాట్లాడుతూ.. మాటూరుపేట, దెందుకూరు పీహెచ్‌సీల పరిధిలో ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు 15,203 మంది ఉన్నారని తెలిపారు. పిల్లల్లో వచ్చే నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ 400 ఎంజీ టాబ్లెట్‌ను ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు, ఏఎన్‌ఎంల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. భోజనం తర్వాత ఈ టాబ్లెట్‌ను నమిలి మింగించాలని, దీని వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు ఇవ్వకూడదని, వైద్యుల సూచనల మేరకే ఇవ్వాలని తెలిపారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనం



గరికపాడు పాత పంచాయతీ కార్యాలయం



కార్యాలయంపై పెరిగిన భారీ వృక్షాలు

వైరారూరల్: మండలంలోని గరికపాడు పాత పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. నిరుపయోగంగా మారిన పాత జీపీ నెర్రలు భారీ, స్లాబు పెచ్చులు ఊడడంతో పాటు చిన్న చిన్న మొక్కలు కూడా మొలిచాయి. దీంతో ఈ భవనం అత్యంత ప్రమాదకరంగా ఉంది. గత ప్రభుత్వం పల్లె ప్రగతి పనుల్లో భాగంగా శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను కూల్చివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. అప్పటి అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కనీసం ఇకనైనా సంబంధిత శాఖాధికారులు పాత జీపీని కూల్చాలని స్థానికులు కోరుతున్నారు.

భట్టి జన్మదిన వేడుకలు

డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేయడంతో పాటు పీహెచ్‌సీల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గ అభివృద్ధి భట్టితోనే సాధ్యమవుతుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరాలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ముదిగొండ: సువర్ణాపురంలో వృద్ధురాలికి దుప్పటి, బ్రెడ్లు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎర్రుపాలెం: రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, యువకులు



తల్లాడలో..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఐపీడీఎస్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మరమ్మతులు, ట్రీకటింగ్ చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు తెలిపారు. కాకర్లపల్లి రోడ్, మసీద్‌రోడ్, సురేష్‌సైకిల్‌షాపు రోడ్, శివసాయినగర్, వాయిపుత్రనగర్, హనుమాన్‌నగర్‌లలో విద్యుత్ సరఫరాలో ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని.. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

కల్లూరు: కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ టౌన్–1 పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వి.గణేష్ శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

ముదిగొండ: ముత్తారం గ్రామంలో మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని యువకులు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. 2011లో గ్రామ యువత ప్రజల సహకారంతో మద్యపానాన్ని నిషేధించగా.. మరళ ఇటీవల విక్రయాలు జరుగుతున్నాయని యువకులు కలెక్టర్‌కు తెలిపారు. మరళ మా గ్రామంలో ఎవరూ మద్యం విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని యువకులు కోరారు.

గోడను కూల్చివేయడం అమానుషం

కల్లూరురూరల్: హైద్రాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం లోటస్‌పాండ్‌కు రక్షణగా నిర్మించిన గోడను శనివారం అధికారులు కూల్చివేయటాన్ని కల్లూరు మండల వైఎస్‌ఆర్ పార్టీ తీవ్రంగా ఖండించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అడ్డురాని ఈ గోడ ఇప్పుడు ఎందుకు అడ్డువస్తుందో సీఎం రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వాలన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై తెలంగాణ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు.

త్యాగరాజన్ జన్మదిన వేడుకలు

సత్తుపల్లిరూరల్: ఐఎన్‌టీయూసీ నాయకుడు త్యాగరాజన్ జన్మదిన వేడుకలను సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో శనివారం ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాలతో బ్రాంచ్ సెక్రటరీ ఎర్ర భట్టి విక్రమార్క కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ క్రాంతికుమార్, జాయింట్ సెక్రటరీ ఎర్ర భాస్కర్, నాగప్రకాష్, నాయకులు చెన్నకేశవ, ఇన్‌చార్జ్ ఫిట్ సెక్రటరీ సమ్మయ్య, రఘువీర్, సందీప్, వి.శ్రీనివాస్, రామచంద్రర్, దావూట్, హరి, డి.శ్రీనివాస్, రఘుపతి, రాంబాబు, అస్గర్ అలి పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి



ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

సత్తుపల్లి: ఎన్నికల కోడ్ ముగిసింది.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికార యంత్రాంగం పనిచేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మట్టా దయానంద్‌తో కలిసి కేక్‌కట్ చేశారు. పెనుబల్లి, వేంసూరు మండలాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. అదేవిధంగా గిన్నీస్‌రికార్డు కోసం కృషి చేస్తున్న సూక్ష్మ కళాకారుడు జి.గౌరిశంకర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, శివవేణు, ఎండి కమల్‌పాషా, పసుమర్తి చందర్‌రావు, తోట సుజలరాణి, కుమారి, రఘుపతిరెడ్డి, చల్లారి వెంకటేశ్వరరావు, దోమ ఆనంద్, కరుణాకర్, సోమిరెడ్డి, సరోజిని పాల్గొన్నారు.

ప్రతిపాదనలు పంపించండి..

సత్తుపల్లి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారులన్నీ గుంతలమయం కాకుండా ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి, పెనుబల్లి ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మధ్యలో ఆగిన పెనుబల్లి మండలం లంకాసాగర్, వైఎస్ బంజరు రోడ్ల పనులను తక్షణమే పనులు మొదలుపెట్టాలని, చౌడవరం మూలమలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నందున నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వెంగళరావునగర్ నుంచి కిష్టారం వైజంక్షన్ వరకు నాలుగులైన్ల రహదారికి ప్రతిపాదనలు చేసి సింగరేణి సీఎండీకి పంపించాలన్నారు. సిద్దారం రోడ్‌ను గౌరిగూడెం వరకు నాలుగులైన్ల రోడ్డుగా విస్తరణ చేసేలా ప్రతిపాదనలు చేయాలన్నారు. సదాశివునిపేట, భీమవరం గ్రామాల్లో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. సత్తుపల్లి పట్టణం, లంకపల్లి రైల్వే వంతెన వద్ద జాతీయ రహదారి ఓవై పురోడ్డు ఎగుడుదిగుడుగా ఉందని.. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐకు నివేదిక పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ ఎంవీ హేమలత, సత్తుపల్లి, పెనుబల్లి డీఈఈలు రమేష్‌కుమార్, ఖలీల్‌అహ్మద్, ఏఈలు నాగేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

చివరి భూములకు సాగర్ జలాలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్

ముదిగొండ: సాగర్‌కాలువల్లో ఉన్న చెత్తాచెదారం తొలగించి చివరి భూములకు సాగర్‌జలాలు అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. సక్రమంగా సాగర్ జలాలు అందించాలని, రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఈ సందర్భంగా కమలాపురం ఎంపీటీసీ దేవరపల్లి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. రోడ్ల వెంట ఉన్న చెట్లు, మొక్కలకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయాయని.. ఈ విషయంలో అధికారుల చెందారన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. అక్రమంగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న కొంతమంది గ్రామదీపికలపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. విచారణ నిర్వహిస్తామని ఏపీఎం కల్పన తెలిపారు. అధికారులు కొంతమంది తమశాఖ నివేదికలు చదివి ఎవరికి వారే వెళ్లిపోయారు. సమావేశం చివరివరకు ఉండడానికి ఒక్కరు కూడా ఆసక్తి చూపలేదు. సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశంలో వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: కారేపల్లిలోని పురాతన పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, మహిళలచే సామూహిక కుంకుమార్చనలను ఆలయ అర్చకడు మల్లిఖార్జునశర్మ నిర్వహించారు. అనతరం భక్తులకు అన్నదానం చేశారు. నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తురక నారాయణ, పెర్ని వెంకటేశ్వర్లు, తురక రవి, బోళ్ల కోమరయ్య, తురక రాంబాబు, పెద్దమ్మ సత్యం, ఓరుగంటి రాజు, పాసిన్ని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?



ముందుకు కదలని మురుగునీరు

- ఎక్కడ మురుగు అక్కడే..
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

వేంసూరు మండలంలో ఈ సారి కూడా పారిశుద్ధ్యంపై అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. ప్రత్యేక అధికారుల పాలన మొదలైనప్పటి నుంచి పల్లెల్లో పారిశుద్ధ్యం, చెత్తసేకరణ కరువైంది. గతేడాది కూడా ప్రజలు సీజనల్ వ్యాధుల భారీన పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఈసారైన గతం గుణపాఠం నేర్చుతుందా.. లేదా అని పల్లె ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

వేంసూరు: పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ మురుగు అక్కడే పేరుకుపోయింది. డ్రెయినేజీ కలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారం చేరడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. కొద్దిపాటి వర్షం పడినా నీరంతా రోడ్డుపైకే చేరుతుంది. దీంతో దుర్గంధంతో పాటు దోమలు పెరిగిపోయాయి. దీంతో రాత్రిసమయాల్లో ప్రజలు అల్లాడుతున్నారు. దీనికి తోడు వాతావరణ మార్పుతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గతేడాది డెంగీ కేసుల్లో వేంసూరు మండలం జిల్లాలోనే ముందుంది.



గ్రామాలను సందర్శిస్తున్న అధికారులు (ఫైల్)


పారిశుద్ధ్య పనులు శూన్యం..

మండలంలో26 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చిన తరువాత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించడంలేదు. గతంలో నిధులు ఉప్పటికీ పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోకపోవడంతోనే సీజనల్ వ్యాధుల భారిన పడ్డామని, ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేని పరిస్థితుల్లో తమ గతి ఏమిటా అని పల్లె ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాదైనా చర్యలు చేపట్టేనా !

గతేడాది పారిశుద్ధ్యంపై అధికారులు.. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం, డ్రైడే కూడా ఫొటోలకే పరిమితం కావడంతో పల్లె ప్రజలు ఎంతో ఆర్థికంగా, ఆరోగ్యం పరంగా నష్టపోయామని, ఇప్పటికైన పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది ఐక్యంగా పనిచేసి పల్లె ప్రజలు ఆరోగ్య కాపాడాలని కోరుతున్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి..



పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రతీ గ్రామంలో.. వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించాలి. అదే విధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, పారిశుద్ధ్యం పనులపై అధికారులు దృష్టి సారించాలి. అదే విధంగా క్రమం తప్పకుండా గ్రామాల్లో ఫ్రైడే.. డ్రైడే నిర్వహించాలి.

– భాస్కర్ల వీరంరాజు, మర్లపాడు